ప్రజాశక్తి
ఆదివారం 20 అక్టోబర్ 2024
5
కర్నూలు



పెండింగ్ క్లెయిమ్స్‌ను పరిష్కరించాలి

- కలెక్టర్ పి.రంజిత్ బాషా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి పెండింగ్ లో ఉన్న క్లెయిమ్స్, అభ్యంతరాలను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఇఆర్ఓ, ఎఇఆర్ఓలను ఆదేశించారు. శనివారం స్పెషల్ సమ్మరీ రివిజన్ -2025 అంశం పై ఇఆర్ఓ, ఎఇఆర్ఓలతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 29న డ్రాఫ్ట్ రోల్ ప్రచురించాల్సి ఉందన్నారు. కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి 625, ఆదోని అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి 520, ఎమ్మిగనూరు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి 375 క్లెయిమ్స్ పెండింగ్ లో ఉన్నాయన్నారు.కోడుమూరు, పత్తికొండ, ఆలూరు, మంత్రాలయం, పాణ్యం నియోజకవర్గాల్లో కూడా క్లెయిమ్స్, అభ్యంతరాలు పెండింగ్ లో ఉన్నాయని వీటిని వెంటనే పరిష్కరించాలన్నారు. 30 రోజుల్లోపు వీటిని పరిష్కరించాల్సి ఉందని, 30 రోజులు దాటినా పెండింగ్ లో ఉంచిన ఎఇఆర్ఓలకు వెంటనే నోటీసులు ఇచ్చి వివరణ కోరాలని సంబంధిత ఇఆర్ఓలను ఆదేశించారు.

యురేనియం తవ్వకాలను అడ్డుకుంటాం

● సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ ● కప్పట్రాళ్ల, పరిసర ప్రాంతాల్లో సిపిఎం పర్యటన

ప్రజాశక్తి - దేవనకొండ

దేవనకొండ మండలంలో కప్పట్రాళ్ల, పరిసర ప్రాంతాల్లోని అటవీ, బంజరు భూముల్లో ప్రభుత్వం తలపెట్టిన యురేనియం తవ్వకాలను అడ్డుకుంటామని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ తెలిపారు. ప్రజా జీవితాలతో చెలగాటమాడే చర్యలను ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. యురేనియం తవ్వకాలకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందన్న వార్తల నేపథ్యంలో శనివారం సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.రాధాకృష్ణ, కెవి.నారాయణ, జిల్లా నాయకులు బి.వీరశేఖర్‌తో కూడిన పార్టీ బృందం కప్పట్రాళ్ల, గ్రామ రెవెన్యూ పరిధిలోని పొలాలను పరిశీలించింది. కప్పట్రాళ్లలో గ్రామస్తులతో మాట్లాడారు. ప్రభుత్వాలు ప్రజల బాగోగులు చూడాలి కానీ కార్పొరేట్ సంస్థల లాభాల కోసం ప్రయత్నం చేయడాన్ని విమర్శించారు. యురేనియం తవ్వకాల వల్ల కప్పట్రాళ్ల, పరిసర ప్రాంతాల్లోని అనేక గ్రామాల ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు రక్షణ ఉండదని తెలిపారు. యురేనియం ఆక్సైడ్ లో కలిసే తీవ్ర మార్పులు జరిగి వాతావరణం, నీరు కలుషితమై పెద్ద ఎత్తున నష్టం జరిగే ప్రమాదం ఉందని చెప్పారు. ప్రమాదకరంగా ఉన్న యురేనియం తవ్వకాల ఆలోచనలు ప్రభుత్వాలు విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కప్పట్రాళ్లలో యురేనియం నిక్షేపాల నిర్ధారణ కోసం తవ్వకాలకు అనుమతి లభించిందన్న సమాచారంతో స్థానికుల్లో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయని పేర్కొన్నారు. యురేనియం నిక్షేపాల నిర్ధారణ కోసం 68 బోర్ల తవ్వకాలకు కేంద్రం అనుమతి ఇచ్చినట్లు సమాచారం ఉందని తెలిపారు. కప్పట్రాళ్ల రిజర్వు ఫారెస్ట్‌లో 6.8 హెక్టార్లలో తవ్వకాలకు అనుమతి ఇచ్చారన్న వార్తలు భయాందోళనకు గురి చేస్తున్నాయని పేర్కొన్నారు. యురేనియం తవ్వకాల ప్రతిపాదనలపై గతంలోనే కప్పట్రాళ్ల వాసులు వ్యతిరేకత వ్యక్తం చేశారని తెలిపారు. మైనింగ్ కోసం, అటవీ అభివృద్ధి కోసం సర్వే చేపడుతున్నామని అధికారులు ప్రజలను మభ్య పెట్టారని పేర్కొన్నారు. స్థానిక యువకులకు ఉద్యోగాలు వస్తాయని ప్రజలకు మాయమాటలు చెప్పారని విమర్శించారు. తాజాగా మళ్లీ ఆ ప్రతిపాదనలు తెరపైకి రావడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. అణు విద్యుత్ ఉత్పత్తిలో, అణ్వాయుధాల తయారీలో ఉపయోగించే యురేనియం అత్యంత ప్రమాదకరమని చెప్పారు. యురేనియం ఉన్న చోట మొక్క కూడా మొలవదని, భయంకర పరిస్థితిలో ఆ ప్రాంతంలో ఉంటుందని పేర్కొన్నారు. కప్పట్రాళ్ల రిజర్వు ఫారెస్ట్ ప్రాంతంలో యురేనియం నిక్షేపాల సర్వే కోసం బోర్ల తవ్వకాలకు ప్రయత్నిస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు. యురేనియం నిల్వలు అంచనా వేసేందుకు జరిపే తవ్వకాల వల్ల కప్పట్రాళ్ల అటవీ ప్రాంతం మొత్తం నాశనం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. భూగర్భ జలాలు, తాగునీరు విషతుల్యం అవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అరుదైన జీవరాశులతో పాటు వృక్ష సంపద ప్రమాదంలో పడి జీవవైవిధ్యం దెబ్బతింటుందనే ఆందోళన వ్యక్తం చేశారు. సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు అశోక్, బాష, సూరి, మార్కండేయులు, కప్పట్రాళ్ల గ్రామస్తులు కొలుట్లయ్య, చిన్న కొలుట్లయ్య, రంగడు, గిడ్డయ్య పాల్గొన్నారు.



పంట పొలాలను పరిశీలిస్తున్న సిపిఎం బృందం



గ్రామస్తుల సమావేశంలో మాట్లాడుతున్న గౌస్‌దేశాయ్

పోలీసు కుటుంబాలకు అండగా ఉంటాం



చెక్కును అందజేస్తున్న ఎస్‌పి బిందు మాధవ్

- పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివి
-ఎస్‌పి బిందు మాధవ్
- పోలీస్ అమరవీరుల కుటుంబాలకు కార్పస్ ఫండ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్

విధినిర్వహణలో వివిధ కారణాలతో, అసాంఘిక శక్తుల చేతిలో మృతి చెందిన పోలీసు సిబ్బంది కుటుంబాల సంక్షేమ కోసం జిల్లా పోలీసు శాఖ ఎల్లప్పుడు కృషి చేస్తుందని కర్నూలు జిల్లా ఎస్‌పి జి. బిందుమాధవ్ తెలిపారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో ముగ్గురు అమరవీరుల కుటుంబాలు , విధినిర్వహణలో మరణించిన 10 మంది పోలీసు కుటుంబ సభ్యులతో జిల్లా ఎస్‌పి సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పరంగా అందాల్సిన ప్రయోజనాలు (బెనిఫిట్స్) జీవితబీమా, జిపిఎఫ్, పెన్షన్, గ్రాట్యూటి, ఎపిజిఎల్ఐ, అర్హులైన కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల గురించి, కుటుంబ స్థితి గతులు, బాగోగులను అడిగి తెలుసుకున్నారు. మంత్రాలయం పిఎస్ - హెడ్ కానిస్టేబుల్ ఎస్. రమేష్ భార్య రాధకు రూ. 1 లక్ష కార్పస్ ఫండ్ చెక్కును, ఆర్ముడు రిజర్వుడు హెడ్ కానిస్టేబుల్ పి.ఖాన్ భార్య నసీమ్ ఖాతున్‌కు రూ. 1 లక్ష కార్పస్ ఫండ్ చెక్కులను ఎస్‌పి అందజేశారు. ఎస్‌పి మాట్లాడుతూ అమరులైన పోలీసు కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. మృతి చెందిన పోలీసు కుటుంబాల సమస్యలను తెలుసుకోవడానికి ఈ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. సిబ్బంది సంక్షేమం కోసం అత్యధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. సమస్యలు పరిష్కరించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే డిపిఒ సిబ్బందిని, జిల్లా ఎస్‌పిని సంప్రదించవచ్చన్నారు. కర్నూలు డిఎస్‌పి జె.బాబు ప్రసాద్, ఎఆర్ డిఎస్‌పి శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచి సిఐలు ప్రసాద్, కేశవరెడ్డి, ఆర్ఐ నారాయణ, పోలీసు సంఘం అధ్యక్షులు నాగరాజు , డిపిఒ సూపరింటెండెంట్‌లు, అమర వీరుల పోలీసు కుటుంబాలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ బాబు

విజిలెన్స్ సిఐడి అధికారుల పేరుతో మోసం

- ఐదుగురిని అరెస్టు చేసిన పోలీసులు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

నకిలీ సిఐడి, విజిలెన్స్ కమిషన్ అధికారుల పేరుతో మోసాలకు పాల్పడుతున్న ఐదుగురిని ఓర్వకల్లు పోలీసులు శనివారం అరెస్టు చేసి అదుపులోకి తీసుకున్నారు. ఓర్వకల్లు పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డిఎస్‌పి బాబు ప్రసాద్ మాట్లాడుతూ... నన్నూరు గ్రామంలోని రాఘమయూరిలో నివాసముంటున్న బెస్త గంగాధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆయన ఇంటికి శుక్రవారం అర్ధరాత్రి 11 గంటలకు నలుగురు నకిలీ విలేకరుల తో పాటు మరొకరు కలిసి ఒక ఫార్చునర్ కారులో చేరుకున్నారన్నారు. నేషనల్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ , సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ ఉన్నతాధికారులమని అక్రమ బియ్యం వ్యాపారం చేస్తున్న నేపథ్యంలో బెస్త శ్రీనివాసులను అరెస్టు చేస్తున్నామని బెదిరించారన్నారు. రూ.పదివేలు శ్రీనివాసులు ఇచ్చినప్పటికీ తర్వాత కర్నూలు డిఎస్‌పికి ఫోన్ చేస్తున్నామని రూ. రెండున్నర లక్షలు ఇస్తే తప్ప వదిలిపెట్టే ప్రసక్తి లేదని బెదిరించినట్లు డిఎస్‌పి తెలిపారు. పోలీసులు అక్కడకి చేరుకోగానే వారు తప్పించుకొని ఫార్చునర్ కారును అక్కడ వదిలేసి వెళ్లారన్నారు. హుసేనాపురం సమీపంలో టీ స్టాల్ లో ఉన్న వీరిని పట్టుకొని అరెస్టు చేసినట్లు వెల్లడించారు. అరెస్టు ఆయన వారిలో నలుగురు చిన్న పత్రికల విలేకరులుగా పనిచేస్తున్న పాలకిటి మధుసూదన్, శీలం అంకిరెడ్డి, పరదేశి రవికుమార్, కొరతల మహేష్, ఆవుల మధు లు ఉన్నారన్నారు. వారి నుండి 7 సెల్‌ఫోన్లు, రూ.10 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు డిఎస్‌పి వెల్లడించారు. వారిపై కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు పేర్కొన్నారు.కర్నూలు తాలూకా సిఐ చంద్రబాబు నాయుడు, ఎస్ఐ సునీల్ కుమార్ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

'మద్యం'పై అధికార పార్టీ పెత్తనం

ప్రజాశక్తి- కర్నూలు ప్రత్యేక ప్రతినిధి

గతంలోని మద్యం పాలసీని మార్పు చేసి కొత్త పాలసీకి టెండర్లు పిలిచి లాటరీ ద్వారా ఎంపిక చేశారు. అధికార పార్టీ నాయకులు భారీగా పెట్టుబడి పెట్టి వందల సంఖ్యలో దరఖాస్తులు చేసుకుంటే లాటరీలో ఐదు, పది కూడా దక్కలేదని అసంతృప్తి చెందిన వారు కొందరయితే, ఎమ్మెల్యేలకు, నియోజకవర్గ ఇన్‌ఛార్జీలకు పర్సెంటేజీలు ఇవ్వని షాపులను ప్రారంభించకుండా అడ్డుకుంటున్నారు. కొందరు దాడులకు దిగుతున్నారు. ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గాల్లో నియోజకవర్గ ఇన్‌ఛార్జీలు, పెత్తనం చేసే వారు పర్సెంటేజీలు ఇవ్వలేదని స్థానిక ప్రజలతో అడ్డు తగిలించి షాపులను ప్రారంభించకుండా అడ్డుకుంటున్నారు. ఒక పక్క చంద్రబాబు నాయుడు హుందాగా వ్యవహరించాలని చెబుతున్నా అక్కడక్కడ ఇలాంటి తగాదాలు బయట పడుతూనే ఉన్నాయి. అభాసుపాలు కావద్దని ఎమ్మెల్యేలను రాజధానికి పిలిచి మందలించినా 'తగ్గేదేలేద'ంటూ ఎమ్మెల్యేల అనుయాయులు, నేరుగా ఎమ్మెల్యేలు గొడవలు చేస్తూనే ఉన్నారు. గొడవలు ఎప్పటికి ఆగుతాయో చూడాలి. ఎవరు అధికారంలో ఉంటే వారు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారు. ఈనెల 16 నుంచి నూతన మద్యం పాలసీ అమల్లోకి వచ్చింది. పలు ప్రాంతాల్లో ఎమ్మెల్యేల అనుమతి లేకుండా దుకాణాలు నిర్వహించుకునేందుకు వీలు లేకపోవడంతో ఎమ్మెల్యే అనుమతి కోసం ఎదురుచూస్తున్నారు. కేటాయించిన షాపులన్నీ తెరచుకోవడానికి అక్కడక్కడా అడ్డంకిగా మారింది. నూతన మద్యం పాలసీపై మహిళా సంఘాలు మండిపడుతున్నాయి. షాపుల సంఖ్య పెంచడం వల్ల జనా వాసాల మధ్య షాపుల ఏర్పాటును ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రయివేట్ మద్యం దుకాణాల కేటాయింపు ప్రక్రియ పూర్తయింది. కర్నూలు జిల్లాలోని 99 దుకాణాలకు, నంద్యాల జిల్లాలోని 105 దుకాణాలకు మొత్తంగా 204 ప్రయివేట్ మద్యం దుకాణాలను లాటరీ ద్వారా కేటాయించారు. కర్నూలు జిల్లాలోని 7 అబ్కారీ పోలీసు స్టేషన్ల పరిధిలో 99 ప్రయివేట్ మద్యం దుకాణాలకు టెండర్లు పిలవగా మొత్తం 3,013 దరఖాస్తులు అందాయి. ఈ దరఖాస్తుల ద్వారా ఎక్సైజ్ శాఖకు రూ.60.26 కోట్ల ఆదాయం వచ్చింది. నంద్యాల జిల్లాలోని 105 ప్రయివేట్ మద్యం దుకాణాలకు 2,155 దరఖాస్తులు వచ్చాయి. రూ.43.10 కోట్ల ఆదాయం సమకూరింది.

దేవరగట్టులో ఆగని రక్తపాతం : కర్నూలు జిల్లా హోళగుంద దేవరగట్టు శ్రీమాల మల్లేశ్వరుని జైత్రయాత్ర (కర్రల సమరం) దసరా రోజు అర్ధరాత్రి జరిగింది. నిఘానేత్రాలు ఉన్నప్పటికీ కర్రలు నాట్యం ఆడాయి. పోలీసుల వ్యూహాలు ఫలించలేదు. జైత్ర యాత్రలో రింగ్ కర్రలు, అగ్ని దివిటీల ఆవిరి తగిలి 95 మందికి గాయాలయ్యాయి. అందులో 25 మందికి బలమైన గాయాలు కావడంతో మెరుగైన చికిత్స కోసం ఆలూరు, ఆదోని ప్రభుత్వాస్పత్రులకు తరలించారు. 800 మంది పోలీసులు ఉన్నప్పటికీ రింగ్ కర్రలను దేవరగట్టుకు రాకుండా ఆపలేకపోయారు. అవగాహన సదస్సులు, రింగ్ కర్రలు స్వాధీనం చేసుకున్నప్పటికీ రక్తపాతం ఆగలేదు. పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారు. నివారించడంలో విఫలమయ్యారని విమర్శలు వెల్లువెత్తాయి.

రైతును ముంచిన తుఫాను : తుఫాను ప్రభావంతో నంద్యాల, కర్నూలు జిల్లాలో భారీగా పంటలు దెబ్బ తిన్నాయి. మొక్కజొన్న, వరి, కంది, పత్తి, ఉల్లి సాగుచేసిన రైతులు నష్టపోయారు. నంద్యాల జిల్లాలో చాగలమర్రి, రుద్రవరం మండలాల్లో మట్టిమిద్దెలు కూలాయి. ఈనెల 14 నుంచి 16 వరకు తుఫాను ప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ ప్రకటించినా నేటికీ దాని ప్రభావం కొనసాగింది.

మరోసారి నదులకు జలకళ : తుఫాను ప్రభావంతో తుంగభద్ర, శ్రీశైలం, సుంకేసుల జలాశయాలకు గరిష్టస్థాయికి నీరు చేసింది. శ్రీశైలం ప్రాజెక్టు గేట్లు ఎత్తడం ఈ ఏడాది వర్షాకాలం ప్రారంభమయ్యాక ఇది ఐదోసారి.

గ్రామస్థాయిలో ప్రభుత్వ పథకాలు : రాష్ట్ర ప్రభుత్వం పల్లెపండగ పేరుతో సిసి రోడ్లు, డ్రెయినేజీలకు అధికారులు, ప్రజాప్రతినిధులు భూమిపూజలు చేస్తున్నారు. ఈనెల 22 వరకు ఈ కార్యక్రమం కొనసాగనుంది. అవసరం ఉన్నచోట కాకుండా అధికార పార్టీ నాయకులు చెప్పిన చోట అవసరం లేకపోయినా రోడ్డు పనులు ప్రారంభిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. భూసమస్యల పరిష్కారం కోసం గ్రామసభలు కూడా నిర్వహిస్తున్నారు. రెవెన్యూ అధికారులు చొరవ తీసుకుంటున్నారు.

విద్యుత్ కార్యాలయాల ముందు ధర్నాలు : టిడిపి కూటమి ప్రభుత్వం ట్రూ అప్ చార్జీల పేరుతో రూ.8,114 కోట్ల విద్యుత్ భారాన్ని ప్రజలపై వేయడాన్ని ఉపసంహరించక పోతే మరో విద్యుత్ ఉద్యమం చేపడతామని సిపిఎం హెచ్చరించింది. విద్యుత్ నియంత్రణ మండలి చేపడుతున్న అభిప్రాయ సేకరణకు వ్యతిరేకంగా కర్నూలు, నంద్యాల జిల్లాల్లో జిల్లా కేంద్రంలోని విద్యుత్ కార్యాలయాల ముందు నిరసన తెలిపారు. అధికారులకు వినతిపత్రాలు ఇచ్చారు.

కొనసాగుతున్న అధికారుల బదిలీలు : నంద్యాల, కర్నూలు జిల్లాల్లో ఆయా శాఖల అధికారుల బదిలీలు కొనసాగుతున్నాయి. రెవెన్యూ, ఇరిగేషన్, ఎక్సైజ్, ట్రాన్స్‌పోర్టు విభాగాలకు నూతన బాస్‌లు విధులో చేరారు. నంద్యాల జిల్లా కేంద్రంలోని ఎన్‌జిఒ కాలనీలోని నేషనల్ పీజీ కళాశాల కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి వర్క్ షాప్‌ను సిఐటియు రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎంఎ.గఫూర్ జెండాను ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ వర్క్ షాప్‌కు ఆలిండియా రోడ్ ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు శివాజీ అధ్యక్షత వహించారు. శని, ఆదివారాలు రెండురోజులపాటు వర్క్‌షాపు కొనసాగనుంది.



ట్రూ ఆప్ ఛార్జీలను ఉపసంహరించాలి

సిపిఎం నగరకమిటీ ధర్నా, ప్రదర్శన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

విద్యుత్ ట్రూ ఆఫ్ చార్జీలను వెంటనే ఉప సంహరించుకోవాలని కోరుతూ శనివారం కర్నూలు నగరంలో సిపిఎం కార్యాలయం నుండి విద్యుత్ కార్యాలయం వరకు ప్రదర్శన చేశారు. చౌక్ బజార్ ,పూల బజార్, వన్ టౌన్ పోలీస్ స్టేషన్, గీతా మందిర్ మీదుగా ర్యాలీగా వెళ్లి ఓల్డ్ టౌన్ విద్యుత్ కార్యాలయం ముందు సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు డి. అబ్దుల్ దేశాయ్ అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఎం సీనియర్ నాయకులు కె.రాజగోపాల్, ఎస్ఎండి.షరీఫ్ లు మాట్లాడుతూ ట్రూ ఆప్ చార్జీల పేరుతో ప్రజలపై రూ.8114 కోర్లు విద్యుత్ భారాన్ని ప్రభుత్వం మోపనుందని తెలిపారు. విద్యుత్ చార్జీలను పెంచబోమని ఎన్నికల కంటే ముందు హామీ ఇచ్చిన చంద్రబాబు నాయుడు ఇప్పుడు నమ్మించి ప్రజలను మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ చార్జీలను పెంపుతో ప్రజలను విపరీతంగా నాడు వైసిపి ప్రభుత్వం దోపిడీ చేసిందని నేడు టిడిపి కుటమి ప్రభుత్వం కూడా అదే బాదుడుకు తెర లేపనుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు రెండు కోట్ల మంది ప్రత్యక్షంగా పరోక్షంగా టోటల్ జనాభాపై ఈభారాలు పడనున్నాయని వివరించారు. పేద మధ్యతరగతి ప్రజలపట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా విద్యుత్ చార్జీలు ఉపసంహరించుకోవాలని సూచించారు. మద్యాన్ని తక్కువ రేటుకు అమ్ముతున్నామని చెబుతున్న చంద్రబాబు కరెంట్ చార్జీలు ఎందుకు పెంచుతున్నారో అర్థం కావడం లేదన్నారు. సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె.రామకృష్ణ ,నగర నాయకులు రవికుమార్ లు ప్రసంగించారు. సీనియర్ నాయకులు డి.పార్వతయ్య, ఎస్‌డి .ఖాజా పాషా, మహబూబ్‌బాషా, రవికుమార్ ,మల్లికార్జున, సయ్యద్ అహమద్ , ఫయాజుల్ కరీం, శాఖ కార్యదర్శులు షేక్షావలి, శ్రీనివాసులు, ఖాజావలి, నాయకులు గౌస్‌బాష ,ఖలీల్ బజారీ ,మూసామియా, జావీద్ గిరీ, మెహబూబ్ తదితరులు పాల్గొన్నారు.



సిపిఎం నగరకమిటీ ఆధ్వర్యంలో ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న షరీఫ్

ఒకేషనల్ కళాశాల ప్రిన్సిపల్‌కు అరుదైన గుర్తింపు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్



విద్యారంగంలో విశేష కృషి చేసిన ప్రభుత్వ బి క్యాంపు ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.నాగస్వామి నాయక్ లండన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో అరుదైన గుర్తింపు పొందారు. ఈ మేరకు శనివారం అందుకు సంబంధించిన ప్రశంసా పత్రాన్ని జిల్లా కలెక్టర్ రంజిత్ బాష ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ నాగ స్వామినాయక్ కు అందజేశారు. అదే విధంగా విద్యా రంగం , సేవా రంగం , , యువత నైపుణ్యాభివృద్ధికి చేసిన సేవలకు ఏషియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ వారు ప్రదానం చేసిన గౌరవ డాక్టరేట్‌ను కలెక్టర్ చేతుల మీదుగా అందుకున్నారు.

ఐరన్ ఓర్ మైనింగ్‌ను పరిశీలించిన ట్రైనీ కలెక్టర్



ప్రజాశక్తి-వెల్దుర్తి : కర్నూలు జిల్లా ట్రైనీ కలెక్టర్ కళ్యాణి వెల్దుర్తి మండలం బోయినపల్లెలోని కాంతా రెడ్డి మైనింగ్ లో శనివారం మైనింగ్ లోని తవ్వకాలను, మెటీరియల్ ను పరిశీలించారు. అనంతరం మైనింగ్ కు సంబంధించిన రికార్డులను మైనింగ్ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. వీరితోపాటు మైనింగ్ శాఖ డిడి రవిచంద్ర, మైనింగ్ ఆర్ఐ సిబ్బంది పాల్గొన్నారు.

23న మద్దికేర సర్వసభ సమావేశం

ప్రజాశక్తి-మద్దికేర

ఈనెల 23న బుధవారం మండల సర్వసభ్య సమావేశం ఉంటుందని ఎంపిడిఒ కొండయ్య తెలిపారు. మద్దికేర ఎంపిడిఒ ఆఫీస్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల సర్వసభ్య సమావేశానికి ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు హాజరుకావాలన్నారు. గత మూడు నెలల కాలంలో చేసిన అభివృద్ధి పనులు, ఇచ్చిన హామీలు ఏ మేరకు నెరవేరాయో, లేదో, మండల ప్రజా ప్రతినిధుల సమక్షంలో చర్చించనున్నట్లు తెలిపారు. అధికారులందరు నివేదికలతో హాజరు కావాలని సూచించారు.



విష్ణువర్ధన్ రెడ్డి పై నిందలు మానుకోవాలి

బి.తాండ్రపాడు సర్పంచి జయన్న

ప్రజాశక్తి కర్నూలు క్రైమ్

టిడిపి సీనియర్ నాయకులు డి.విష్ణువర్ధన్‌రెడ్డిపై టిడిపి నగర అధ్యక్షుడు డి.నాగరాజు చేస్తున్న విమర్శలు మానుకోవాలని బి.తాండ్రపాడు సర్పంచి ఆకెపోగు జయన్న అన్నారు. శనివారం కర్నూలు ఎస్‌బిఐ కాలనీలోని ఎన్‌విఆర్ ఫంక్షన్ హాలులో గూడూరు టిడిపి మండల ఇన్‌ఛార్జి సురేష్, పసుపుల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మాజీ చైర్మన్ వేమన్నగౌడ్, గూడూరు టిడిపి పంచాయతీ ఇంచార్జి గజేంద్ర గౌడ్ తో కలిసి విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... కర్నూలు మండలం నూతన పల్లె వద్ద ఏర్పాటు చేసిన మద్యం దుకాణం పై స్థానిక ప్రజలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రజల దినచర్యలకు ఇది ఆటంకంగా మారనుందని స్థానికులే అక్కడ మద్యం షాపును అడ్డుకున్నారన్నారు. మద్యం షాపు ఎవరికి దక్కినా తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే ప్రాంతంలో ఏర్పాటు చేయడమే సరైంది కాదన్నారు. ప్రధానంగా పసుపుల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఏర్పాటు చేసిందన్నారు. సొసైటీకి సంబంధించిన భవనాల్లో మద్యం అమ్మకాలు చేయరాదని, సొసైటీ నిబంధనలో స్పష్టంగా పేర్కొని ఉందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఈ మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేశారన్నారు. టిడిపి సీనియర్ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి పై నిందారోపణలు చేయడం సబబు కాదన్నారు. టిడిపి నగర అధ్యక్షుడుగా ఉంటూ నాగరాజు టిడిపి పరువును బజారుకీడుస్తున్నారని ఆరోపించారు. దీని వెనక ఉన్న అసలు వ్యక్తులు ఎవరో బయట పెట్టాలన్నారు. అధికార పార్టీలో ఉంటూ ప్రతిపక్ష పార్టీ నాయకులతో చేతులు కలిపి వ్యాపార సంబంధాలు కలిగి ఉన్న వ్యక్తి నాగరాజు అని అన్నారు. ఇలాంటి వ్యక్తిని పార్టీ నుండి సస్పెండ్ చేయాలని అధిష్టానాన్ని డిమాండ్ చేశారు.

అరుణ కుమారికి ఎమ్మెల్సీ ఇవ్వాలి

రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ కెజి.గోవిందరెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్ : టిడిపిలో 35 ఏళ్లుగా సేవలందిస్తున్న సి.అరుణకుమారిని ఎమ్మెల్సీగా నియమించాలని రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కెజి.గోవిందరెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన శనివారం టిడిపి అధిష్టానానికి లేఖ రాశారు. కర్నూలు జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలుగా ఆమె రెండు పర్యాయములు సేవలు అందించారన్నారు. టిడిపి రాష్ట్రస్థాయి కార్యకర్తల శిక్షణా తరగతులకు పార్టీ ఆదేశానుసారం బోధకురాలుగా రాష్ట్ర వ్యాప్తంగా అనేక ప్రాంతాలలో సేవలు అందించారన్నారు. ప్రతి అసెంబ్లీ ఎన్నికలలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో అనేక నియోజక వర్గాలు తిరిగి పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేశారు. స్వతహాగా సంఘ సేవకురాలు అయిన సి.అరుణకుమారి టిడిపి క్రమశిక్షణ కలిగిన సైనికురాలుగా పనిచేస్తున్నారన్నారు. ఆమె సేవలకు గుర్తింపుగా డాక్టరేట్ కూడా ఇచ్చారన్నారు. ఆమెను ఎమ్మెల్సీగా నైనా ప్రకటించాలని లేఖలో పేర్కొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడినా ప్రోత్సహించినా చర్యలు

యాంటీ ర్యాగింగ్ పై కర్నూలు మెడికల్ కాలేజీలో అవగాహన సదస్సు
జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

విద్యాసంస్థల్లో విద్యార్థులు ర్యాగింగ్ కు పాల్పడవద్దని, ప్రోత్సహించకూడదని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీల వెంకట శేషాద్రి అన్నారు. శనివారం కర్నూల్ మెడికల్ కళాశాలలో యాంటి ర్యాగింగ్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి, జిల్లాఎస్‌పి జి. బిందుమాధవ్, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎస్.మనోహర్, కర్నూలు గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ సూపరిండెంట్ డాక్టర్ సి ప్రభాకర్ రెడ్డి, కర్నూలు మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.చిట్టి నరసమ్మ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ యాంటీ ర్యాగింగ్ పై విద్యార్థులు ప్రత్యేక అవగాహన పెంచుకోవాలని అన్నారు. ర్యాగింగ్ దుష్ప్రభావాల గురించి, విద్యా సంస్థలలో ర్యాగింగ్ నిషేధానికి సంబంధించిన శిక్షాపరమైన నిబంధనలు , ర్యాగింగ్ కు పాల్పడిన వ్యక్తుల పై భారతీయ శిక్షాస్మృతి లోని సంబంధిత సెక్షన్ల ప్రకారం వారికి జైలు శిక్ష లేదా జరిమానా లేదా రెండూ విధించబడతాయని తెలిపారు. నేరం తీవ్రతను బట్టి శిక్ష పరిమాణం మారుతుందన్నారు. ర్యాగింగ్ వల్ల కలిగే దుష్ప్రభావాలపై విస్తృతంగా అవగాహన నిర్వహించడం, ర్యాగింగ్‌లో పాల్గొనడంపై శిక్షాస్పద నిబంధనలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా విద్యార్థులు ర్యాగింగులో పాల్గొన్నా అందుకు ప్రోత్సహించినా వారికి శిక్ష ఉంటుందన్నారు. దీని వల్ల విద్యార్థులకు భవిష్యత్తులో సమస్యలు ఏర్పడుతాయన్నారు. లెక్చరర్లు, కాలేజీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న బి.లీలా వెంకట శేషాద్రి



తైక్వాండో క్రీడాకారులకు ఎంఎ.గఫూర్ అభినందన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : రాష్ట్రస్థాయిలో మెడల్స్, సర్టిఫికెట్లు సాధించిన తైక్వాండో క్రీడాకారులకు కర్నూలు మాజీ ఎమ్మెల్యే, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ.గఫూర్ శనివారం అభినందించారు. ఈ నెల 6,7,8 తేదీల్లో తిరుపతి శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎస్‌జిఎఫ్ఐ స్కూల్‌గేమ్స్ అండర్-17 బాలుర తైక్వాండో కోచ్ జి.షబ్బీర్‌హుస్సేన్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన క్రీడాకారుడికి బ్రాంజ్ మెడల్ వచ్చింది. ముందుగా సెప్టెంబర్ 30న నంద్యాల పద్మావతి నగర్ ఇండోర్‌స్టేడియంలో జిల్లాస్థాయిలో గెలుపొంది రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. జి.ప్రణవ్‌శ్రీరామ్ 78 కేజీల విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించాడు. జి.ప్రణవ్ శ్రీరామ్‌కి మెడల్స్, సర్టిఫికెట్స్ ఎంఎ.గఫూర్, ప్రజాశక్తి కర్నూలు ఎడిషన్ కార్యాలయంలో ప్రజాశక్తి ఎడిటర్ బి.తులసిదాసు, రవీంద్రవిద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య, జనరల్ మేనేజర్ నరసింహ అందజేసి అభినందించారు. భవిష్యత్తులో జిల్లాకు, రాష్ట్రానికి తల్లిదండ్రులకు, చదువుతున్న పాఠశాలలకు మంచి పేరు తీసు కురాలని సూచించారు. తైక్వాండో కోచ్ జి.షబ్బీర్‌హుస్సేన్, ప్రజాశక్తి డెస్క్ ఇన్‌ఛార్జి పానుగంటి చంద్రయ్య, క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వేధింపులు తాళలేక
విద్యార్థిని ఆత్మహత్య

● నగరూరులో విషాదం


అశ్విని (ఫైల్)

ప్రజాశక్తి - ఆస్పరి

తనను ప్రేమించాలంటూ యువకుడు పెట్టే వేధింపులు తాళలేక ఇంటర్మీడియట్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన నగరూరు గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి... నగరూరు గ్రామానికి చెందిన చిన్న వీరేష్, నరసమ్మల చిన్న కుమార్తె అశ్విని(16) పత్తికొండలోని కస్తూరిబా పాఠశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నారు. అశ్విని దసరా సెలవుల కోసం సొంత గ్రామమైన నగరూరు వచ్చారు. సెలవులు ముగించుకొని వెళ్లేలోపు కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. తనను ప్రేమించాలంటూ సన్నీ అనే యువకుడు గత కొన్ని రోజులుగా అశ్విని చుట్టూ తిరిగేవాడు. విషయం తెలుసుకున్న అశ్విని తలిదండ్రులు పలుమార్లు హెచ్చరించారు. అయినా సన్నీ మారలేదు. సెలవుల్లో ఇంటికి వచ్చిన అశ్విని ఇంట్లో ఉండగా తల్లిదండ్రులు పొలం పనులకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో సన్నీ ఇంట్లోకి దూరాడు. తెలుసుకున్న కొందరు ఇంటి బయట గడియ పెట్టి అమ్మాయి బంధువులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న వారు సన్నీపై దాడి చేసేందుకు ప్రయత్నించగా తప్పించుకొని పారిపోయాడు. తల్లిదండ్రులు వచ్చేసరికి అశ్విని పురుగు మందు తాగారు. అశ్విని నోటి నుంచి నురగ రావడంతో తల్లిదండ్రులు ఏం జరిగిందని ప్రశ్నించారు. 'సన్నీ ఇంటికి వచ్చి నన్ను ప్రేమిస్తావా లేదా చంపుతా' అంటూ బెదిరించాడని తెలిపారు. అశ్వినిని ఆదోని ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తమ అమ్మాయిని సన్నీ అనే యువకుడు చంపాడని తల్లిదండ్రులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సిఐ మస్తాన్ వలీ వివరాల మేరకు... నగరూరు గ్రామానికి చెందిన చిన్న వీరేష్, నరసమ్మల చిన్న కుమార్తె అశ్విని పత్తికొండలోని కస్తూరిబా పాఠశాలలో ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నారు. దసరా సెలవుల నిమిత్తం స్వగ్రామానికి వచ్చారు. ప్రేమిస్తున్నానంటూ అదే గ్రామానికి చెందిన సన్నీ అశ్వినిని వేధింపులకు గురి చేసేవాడు. మనస్తాపం చెందిన అశ్విని పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ మస్తాన్ వలీ శనివారం తెలిపారు.


మృతదేహం వద్ద రోధిస్తున్న కుటుంబసభ్యులు, బంధువులు

'సూర్య ఘర్'ను వినియోగించుకోండి
- ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి

ప్రజాశక్తి - ఆదోని

ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి తెలిపారు. శనివారం కపర్తి నగర్‌లోని డాక్టర్ విజయ్ కుమార్ ఇంటిపై ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకాన్ని ఎమ్మెల్యే పార్థసారథి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ పథకాన్ని వినియోగించుకోవడం ద్వారా విద్యుత్ ఇంట్లో తక్కువ ధరకే వినియోగించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇందులో మిగిలిన విద్యుత్‌ను అమ్ముకునే వెసలుబాటు ఉంటుందని చెప్పారు.


పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

పోలీసు అమరవీరుల త్యాగం మరువలేనిది
- ఎస్ఐ సతీష్ కుమార్

ప్రజాశక్తి - చిప్పగిరి

పోలీసు అమరవీరుల త్యాగం మరువలేదనిదని, నిత్యం ప్రశాంత జీవితానికి సోపానమని ఎస్ఐ సతీష్ కుమార్, పోలీసులు యశ్వంత్, భాస్కర్ తెలిపారు. ఈనెల 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా శనివారం చిప్పగిరి బస్టాండ్ దగ్గర బ్యానర్‌ను ఎస్ఐ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దేశ రక్షణ కోసం పోలీసు అమరవీరులు చేసిన త్యాగ ఫలమే ప్రజా జీవితాల ప్రశాంతతకు సోపానాలని కొనియాడారు. దేశ ప్రశాంతత కోసం విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన వారికి ఈనెల 21న సంస్మరణ సభ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నిత్యం కనురెప్పలాగా కాపాడి రక్షణ కలిగించే పోలీసులకు ఎంతో రుణపడి ఉంటామన్నారు.

భూసర్వే సమస్యల పరిష్కారానికి చర్యలు

● సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్


ఆదోనిలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

భూసర్వే వల్ల నష్టపోయిన రైతుల సమస్యల పరిష్కారం కోసమే గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, తహశీల్దార్ శివరాముడు తెలిపారు. శనివారం మండలంలోని వి.కొండాపురం, దొడ్డినగేరి గ్రామంలో రెవెన్యూ భూసర్వేపై గ్రామసభ నిర్వహించారు. భూసర్వే వల్ల తమకు తక్కువ విస్తీర్ణం వచ్చిందని కొంతమంది రైతుల నుంచి అర్జీలు వచ్చినట్లు తహశీల్దార్ తెలిపారు. వాటిని పూర్తిగా పరిశీలించి, నెల రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ పెద్దయ్య, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య తెలిపారు. **హోళగుంద** మండలంలోని మునానుగుంది గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ మాట్లాడారు. రీసర్వేలో జరిగిన అభ్యంతరాలను వినతి రూపంలో తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. తహశీల్దార్ సతీష్, డిప్యూటీ తహశీల్దార్ నిజాముద్దీన్, రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ ముకుందరావు పాల్గొన్నారు. **చిప్పగిరి** మండలం నగరడోనా పంచాయతీ మజరా గ్రామమైన తిమ్మాపురంలో విఆర్ఒ రంగన్న ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్, డివిజనల్ సర్వేయర్ విజయ్ భాస్కర్‌లు రైతులకు భూ సమస్యలపై అవగాహన కల్పిస్తూ భూ సమస్యలపై వచ్చిన 45 వినతులను స్వీకరించారు. ఆర్ఐ సునీత, విఆర్ఒలు మల్లికార్జున, పెద్దన్న, విలేజ్ సర్వేయర్ వినోద్ కుమార్ పాల్గొన్నారు.

కూలిపోయిన ఇళ్లను పరిశీలించిన అధికారులు

రామదుర్గం గ్రామంలో వర్షాలకు కూలిపోయిన ఇళ్లను రెవెన్యూ కార్యదర్శి మల్లికార్జున ఆధ్వర్యంలో తహశీల్దార్ ఇజాద్ అహ్మద్ పరిశీలించారు. ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి పరిహారం అందేలా చూస్తామని ఇల్లు కూలిపోయిన వారికి భరోసా ఇచ్చారు.


హోళగుందలో మాట్లాడుతున్న అధికారులు


తిమ్మాపురం (చిప్పగిరి)లో మాట్లాడుతున్న అధికారులు

కష్టపడి చదివితే గుర్తింపు
- డీఎస్పీ ఉపేంద్రబాబు

ప్రజాశక్తి - గోనెగండ్ల

ప్రతి విద్యార్థీ ఇష్టంతో కష్టపడి చదివి జీవితంలో రాణించి ఉత్తమ పౌరులుగా గుర్తింపు పొందాలని ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్ర బాబు తెలిపారు. శనివారం గోనెగండ్లలోని ఎపి మోడల్ పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థులకు ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు బాల్యం నుంచే ఇతరులపై ఆధారపడకుండా ఎవరి పనులు వారే చేసుకోవడం అలవాటు చేసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు చెప్పే విషయాలను శ్రద్ధగా విని మంచిని గ్రహించి తెలివితేటలను పెంచుకోవాలన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై గౌరవం కలిగి ఉండి క్రమశిక్షణతో పట్టుదలతో చదివి కలలను సాకారం చేసుకోవాలని తెలిపారు. గోనెగండ్ల సిఐ ఎ.గంగాధర్, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ షాహినా పర్వీన్ పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ

ముగిసిన శిక్షణ తరగతులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని పంచాయతీల ఉప సర్పంచి, వార్డు మెంబర్లకు రెండు రోజుల నుంచి నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఈ శిక్షణలో శిక్షకులు నాగరాజు శిక్షణ ఇచ్చారు. పారిశుధ్యం, గ్రామ పంచాయతీల్లో వార్డు మెంబర్లు, ఉప సర్పంచుల పాత్ర, పంచాయతీ రాజ్ చట్టం సెక్షన్ 83 నుంచి 100, జిఒ ఎంఎస్ నెంబర్ 138 గురించి వివరించారు. పంచాయతీల ఆర్థిక వ్యవహారాలు, పంచాయతీల పరిధిలో లే అవుట్లు, నియమ నిబంధనలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వీటిలో ఉప సర్పంచి, వార్డు మెంబర్ల పాత్ర గురించి వివరించారు. ఎంపిడిఒ రాజేంద్రప్రసాద్, ఇఒఆర్‌డి జనార్ధన పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఎంపిడిఒ రాజేంద్ర ప్రసాద్

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

● యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు నాగమణి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు/నందవరం

పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎన్.నాగమణి తెలిపారు. శనివారం నందవరం మండలం ముగతి ప్రాథమిక పాఠశాలలో స్వర్ణోత్సవ మండల మహాసభ నిర్వహించారు. మండల అధ్యక్షులు ఆర్.వెంక్రటాముడు అధ్యక్షత వహించారు. యుటిఎఫ్ జెండాను సీనియర్ నాయకులు దేవసహాయం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నాయకులు నాగమణి, ఎస్.దావీదు, దేవపాల్, జె.ఎల్లప్ప మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం కావాలంటే పోరాటాలే ఏకైక మార్గమన్నారు. ఉద్యమాలు, పోరాటాలు లేకుండా ఏ ఒక్క సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు. పాలకుల విధానాల వల్ల విద్యారంగం అస్తవ్యస్తంగా మారిందని విమర్శించారు. ఉద్యోగులు ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న పెన్షన్ హక్కును సైతం పాలకులు కాలరాశారని మండిపడ్డారు. గత వైసిపి ప్రభుత్వం ఉద్యోగుల పట్ల కక్షపూరితంగా వ్యవహరించిందని తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన రూ.25 వేల కోట్ల ఆర్థిక బకాయిలను చెల్లించలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఉద్యోగ, ఉపాధ్యాయులకు అనేక హామీలు ఇచ్చిందని పేర్కొన్నారు. ఉద్యోగుల అండదండలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి నాలుగు నెలలవుతున్నా ఉద్యోగుల సమస్యలపై దృష్టి సారించలేదన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే 117 జిఒను రద్దు చేస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వ పెద్దలు మీనమేషాలు లెక్కిస్తున్నారని విమర్శించారు. సిపిఎస్, జిపిఎస్ విధానాలను రద్దు చేస్తామని ఎన్నికలకు ముందు ప్రకటించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేదని తెలిపారు. ఆర్థిక బకాయిల చెల్లింపుల పట్ల కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధి కనపరచడం లేదని విమర్శించారు. జులై 1, 2023 నుంచి 12వ పిఆర్‌సిని అమలు చేయాల్సి ఉందన్నారు. గత ప్రభుత్వం నియమించిన 12వ పిఆర్‌సి ఛైర్మన్ డాక్టర్ మన్మోహన్ సింగ్ రాజీనామా చేసినందున రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నూతన ఛైర్మన్‌ను నియమించాలని కోరారు. పిఆర్‌సి అమలయ్యే వరకు 30 శాతం మధ్యంతర భృతిని చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకపోతే భవిష్యత్తులో పోరాటాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా అబ్దుల్ రహిమాన్, అధ్యక్షులుగా ఆర్.వెంకట్రాముడు, సహాధ్యక్షులుగా ఉసేని, కె.పద్మావతమ్మ, ఆర్థిక కార్యదర్శిగా ఎస్.నరసిం హులు, ప్రధాన కార్యదర్శిగా ఎన్.నాగరాజు, కార్యదర్శులుగా జె.రంగన్న, వినోద్ కుమార్, టి.నాగరాజు, సురేంద్రబాబు, ఇస్సాక్, ఇందిరమ్మ, మహబూబ్ బాష, సురేష్, మహిళా విభాగం కన్వీనర్‌గా ఎం.ఉమాదేవి, ఆడిటర్‌గా కె.రాజు, జిల్లా కౌన్సిలర్లుగా జె.ఎల్లప్ప, కె.భాగ్యరాజు, విరుపాక్షి, పరమేష్, మహేశ్వరి, అకడమిక్ విభాగం కన్వీనర్‌గా ఎస్.ఆంజనేయులు, సాంస్కృతిక విభాగం కన్వీనర్‌గా వీరభద్రయ్య ఎన్నికయ్యారు.


యుటిఎఫ్ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు దేవ సహాయం

విచ్చలవిడిగా బెల్ట్ షాపులు
- పోలీసు శాఖ నిర్లక్ష్యం

ప్రజాశక్తి - నందవరం

నందవరంలో బెల్ట్ షాపులు విచ్చలవిడిగా వెలిశాయి. బెల్ట్ షాపుల్లో మద్యం ఏరులై పారుతోంది. 30 ఏళ్లకుపైగా నందవరంలో వైన్ షాప్ ఉండేది. ప్రస్తుతం కొత్త పాలసీ ప్రకారం వైన్ షాపులు దక్కించుకున్న యజమానులు మేజర్ పంచాయతీ అయిన నందవరంలో కాకుండా పంచాయతీలు నాగలదిన్నె, ముగతిలో వైన్ షాపులను ఏర్పాటు చేశారు. ఇదే అదునుగా భావించి చాలా మంది గ్రామంలో బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారు. ఇష్టానుసారంగా మద్యం రేట్లు పెంచి మద్యం ప్రియుల జేబులకు చిల్లు పెడుతున్నారు. క్వార్టర్ బాటిల్‌పై ఏకంగా రూ.40 అదనంగా వసూలు చేస్తూ మందుబాబుల జేబులు ఖాళీ చేస్తున్నారు. గ్రామంలో విచ్చలవిడిగా బెల్టు షాపులు నిర్వహిస్తున్నా పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. బెల్ట్ షాపు నిర్వాహకులు యథేచ్ఛగా మద్యం అమ్మకాలు జరుపుతున్నా పోలీసులు అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. నందవరంలో ఉండాల్సిన వైన్ షాపులను పల్లెటూర్లకు కేటాయించినా మండల నాయకులు చోద్యం చూస్తున్నారని పేర్కొంటున్నారు.

వీరశైవ లింగాయత్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు
- వీరశైవ లింగాయత్ సంఘం అధ్యక్షులు రాచోటప్ప, కార్యదర్శి మల్లికార్జున

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పదో తరగతి, ఇంటర్ రెండో సంవత్సరంలో 90 శాతానికి పైగా మార్కులు సాధించి వీరశైవ లింగాయత్ విద్యార్థులకు సంఘం తరపున ప్రతిభా పురస్కారాలు అందిస్తున్నట్లు వీరశైవ లింగాయత్ సంఘం అధ్యక్షులు వజ్రగిరి రాచోటప్ప, కార్యదర్శి మామిడి మల్లికార్జున తెలిపారు. శనివారం వారు మాట్లా డారు. ఎమ్మిగనూరు పట్టణం, మండలం, నందవరం, గోనెగండ్ల, మంత్రాలయం, కోసిగి, పెద్దకడబూరు మండలాలకు చెందిన వీరశైవ లింగాయత్ విద్యార్థులు ఈనెల 31లోపు పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఆధార్ కార్డు, పదో తరగతి మార్క్ లిస్ట్, ఇంటర్ రెండో సంవత్సరం మార్క్ లిస్ట్, టీసీ, కుల ధ్రువీకరణ పత్రం జత చేసి శ్రీశారద ఎలక్ట్రానిక్స్, ట్యాంక్ బండ్ రోడ్డు, ఎమ్మిగనూరులో అందజేయాలని చెప్పారు. ఇతర వివరాలకు వీరశైవ సంఘం, ఎమ్మిగనూరు 9440293342, 9848892777, 9885490992 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

మంత్రి కొల్లును కలిసిన ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రాష్ట్ర గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి కొల్లు రవీంద్రను ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వర రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం అమరావతిలో ఆయన ఛాంబర్‌లో కలిసి నియోజకవర్గ అభివృద్ధిపై వివరించారు. ఎమ్మిగనూరు పట్టణం, మండలం, నందవరం, గోనెగండ్ల మండలాల్లో తమకు నిధులు కేటాయించి అభివృద్ధికి సహకరించాలని కోరారు.



సీనియర్ మేటీపై చర్యలు తీసుకోవాలి : టిడిపి

ప్రజాశక్తి - గోనెగండ్ల

పెద్దమరివీడు గ్రామంలో పని చేయని వ్యక్తుల పేర్లతో తప్పుడు మస్టర్లను తయారుచేసి ఉపాధి హామీ చట్టం ద్వారా నిధులను స్వాహా చేసిన సీనియర్ మేటీ గజేంద్ర గౌడ్‌పై చర్యలు తీసుకోవాలని టిడిపి నాయకులు మాదిగ నాగరాజు, ప్రభుదాసు కోరారు. శనివారం గోనెగండ్ల ఎంపిడిఒ మణి మంజరికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పంచాయతీలో గ్రీన్ అంబాసిడర్‌గా పనిచేస్తున్న బొగ్గుల మునెప్ప మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో స్వీపర్‌గా పనిచేస్తున్న బొగ్గుల రోజమ్మ పేరుతో (జాబ్ కార్డు నెంబర్ 0376) నిధులు స్వాహా చేశారని తెలిపారు. అలాగే అంగన్వాడీ ఆయాగా పనిచేస్తున్న వడ్ల పద్మావతి ఆమె భర్త ఉప సర్పంచి నరసన్న ఆచారి వారి కుమార్తె సర్పంచి మౌనిక పేర్లపై (0391 జాబ్ కార్డుతో) పనులు చేయకుండానే నిధులు చేసినట్లు చెప్పారు. అక్రమ మస్టర్లతో నిధులు స్వాహా చేసిన సీనియర్ మేటీ గజేంద్ర గౌడ్‌పై విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

గ్రామీణ వైద్యునికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

అనారోగ్యానికి గురైన గ్రామీణ వైద్యునికి విశ్వబ్రహ్మ హెల్త్ కేర్ సొసైటీ, సామాజిక వైద్యుల సంఘం ఆధ్వర్యంలో శనివారం ఆర్థిక సహాయం అందజేసినట్లు సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షులు జాలవాడి శ్రీనివాసులు మాట్లాడారు. పర్ల గ్రామంలో గ్రామీణ వైద్యునిగా పని చేస్తూ ఇటీవల పక్షవాతానికి గురైన కురువ దస్తగిరికి రూ.90 వేల ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. దస్తగిరి కోలుకునే వరకు అండగా ఉంటామన్నారు. గతంలోను రహదారి ప్రమాదంలో మృతి చెందిన పెద్దతుంబలం రామరాజు కుటుంబానికి రూ.1.30 లక్షలు, క్యాన్సర్‌తో బాధపడుతున్న మాలపల్లి నాగరాజు కుమారుని వైద్యానికి దాదాపు రూ.లక్ష సహాయం చేశామన్నారు. నాగలాపురం వెంకటేష్, ఉల్చాల విజయ్, వి.ఈరన్న, బోడబండ నరసింహులు, రచ్చుమర్రి రామకృష్ణా రెడ్డి, సుంకేసుల దేవా, వెంకట్, కమ్మరి ఈరన్న పాల్గొన్నారు.


ఆర్థిక సాయం అందజేస్తున్న సభ్యులు

అభివృద్ధి పనులకు సహకరిస్తాం

● ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

నియోజకవర్గ పరిధిలో జరిగే అభివృద్ధి పనులకు సహకరిస్తామని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తెలిపారు. టిడిపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'పల్లె పండగ'లో భాగంగా శనివారం మండలంలోని రాంపురం, కాచాపురం గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఆయన భూమి పూజ చేశారు. బసాపురం గ్రామంలో వైసిపి మండల అధ్యక్షులు జి.భీమిరెడ్డి, ఖగ్గల్లు గ్రామంలో వైసిపి నాయకులు బాబురెడ్డి నాలుగు గ్రామాల్లో సిసి రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి మాట్లాడారు. ఉపాధి హామీ చట్టం నిధుల కింద రూ.30 లక్షలతో సిసి రోడ్ల పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. మండల ప్రత్యేకాధికారి సత్యనారాయణ శర్మ ఎంపిడిఒ శోభారాణి, పంచాయతీ రాజ్ ఎఇ మల్లయ్య, ఉపాధి ఏపీడీ లోకేష్, ఎపిఒ తిమ్మారెడ్డి, ఈసీ సూర్య ప్రకాష్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ వెంకటరాముడు, వైసిపి నాయకులు పెట్రోల్ బంక్ శీను, కాంట్రాక్టర్ బంగారు బాబు పాల్గొన్నారు. **కౌతాళం** మండలంలోని వల్లూరు 'పల్లె పండగ' నిర్వహించారు. టిడిపి సీనియర్ నాయకులు ఉల్లిగయ్య, అడివప్ప గౌడ్, టిప్పు సుల్తాన్ ఆధ్వర్యంలో వల్లూరులో రూ.13 లక్షలతో, ఉప్పరహాల్‌లో రూ.10 లక్షలతో సిసి రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణానికి భూమిపూజ చేశారు. నాయకులు సురేష్ నాయుడు, సతీష్ నాయుడు, వెంకటపతి రాజు, వల్లూరు సర్పంచి పంపాపతి గౌడ్, టిడిపి నాయకులు గోవిందు, రాజానందు, శివమూర్తి, సుబ్రహ్మణ్యం రాజు, రామాంజిని, పకీరయ్య, ఈరన్న, సురేష్, బీరమల్లప్ప, లింగన్న, కర్రెప్ప పాల్గొన్నారు. **చిప్పగిరి** మండలం బెల్డోన గ్రామంలో 'పల్లె పండగ' నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి నరేంద్ర ఆధ్వర్యంలో సర్పంచి కరివేముల సావిత్రి అధ్యక్షతన రూ.10 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. మాజీ వైస్ ఎంపిపి వెంకటేశులు, మాజీ సర్పంచి మారాతి భీమా, ఉప సర్పంచి ముద్దప, టిడిపి నాయకులు గోవిందు, శ్రీనివాసులు, సతీష్, గోవర్ధన, ఇన్‌ఛార్జీ ఎంపిడిఒ శ్రీనివాసులు, ఎఒ జయలక్ష్మి, ఎపిఒ జుబర్ అహ్మద్, ఎపిఎం నాగార్జున, పంచాయతీ కార్యదర్శి రామాంజనేయులు, విఆర్ఒ చంద్రనాయక్ పాల్గొన్నారు. కుందనగుర్తి గ్రామంలో సర్పంచి కొండా పురుషోత్తం ఆధ్వర్యంలో రూ.20 లక్షలతో సిసి రోడ్డుకు భూమిపూజ చేశారు. **దేవనకొండ** మండలంలోని నేలతలమర్రి గ్రామంలో 'పల్లెపండగ' నిర్వహించారు. టిడిపి మండల కన్వీనర్ విజయ భాస్కర్ గౌడ్ సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. టిడిపి నాయకులు నాగరాజు గౌడ్, గ్రామ పెద్ద వెంకప్ప, పంచాయతీ కార్యదర్శి రామాంజనేయులు పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు (రూరల్)** మండలం సోగనూర్ గ్రామంలో ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు 'పల్లె పండగ' నిర్వహించారు. మండల అధికారి బంగారమ్మ, ఎపిఒ విజయ్ కుమార్ పాల్గొని సిసి రోడ్లకు భూమిపూజ చేశారు. అనంతరం గ్రామసభ లో ఉపాధి పనులకు సంబంధించిన విషయాలు వివరించారు. టిడిపి నాయకులు కోటేకల్ జగదీష్, మండల నాయకులు రాఘవేంద్ర, గౌస్ పీరా, సర్వేయర్లు నాగేంద్ర గౌడ్, భగవంతు, నరసన్న, పరమేష్ పాల్గొన్నారు.


మంత్రాలయం : భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి


కౌతాళంలో భూమి పూజ చేస్తున్న నాయకులు


చిప్పగిరిలో భూమి పూజ చేస్తున్న నాయకులు


దేవనకొండలో భూమి పూజ చేస్తున్న నాయకులు

పరిహారం ఇప్పించి ఆదుకోండి
- టిడిపి సీనియర్ నాయకులు కల్లుపోతుల రంగన్న

ప్రజాశక్తి - ఆదోని

ఆర్థికంగా నష్టం చేయాలన్న దురుద్దేశంతో దుండగులు తోట దగ్ధం చేశారని, పరిహారం ఇప్పించి ఆదుకోవాలని టిడిపి సీనియర్ నాయకులు, మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ కల్లుపోతుల రంగన్న కోరారు. శనివారం మంగళగిరిలోని టిడిపి కార్యాలయంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావుకు వినతిపత్రం ఇచ్చారు ఈ సందర్భంగా కల్లుపోతుల రంగన్న మాట్లాడారు. రాజకీయ కక్ష సాధింపుతోనే గుర్తు తెలియని దుండగులు 2021 మార్చిలో పెట్రోల్ పోసి తోటలోనే కొబ్బరి, ఎర్రచందనం మొక్కలను దగ్ధం చేశారని తెలిపారు. ఈ ఘటన వల్ల సుమారు రూ.40 లక్షల నష్టం వాటిల్లిందని, గతంలో ఈ ఘటనకు సంబంధించి అధినేత చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. అప్పట్లో రూ.2 లక్షల సహాయం చేశారని గుర్తు చేశారు. అధికారం రాగానే పూర్తిస్థాయిలో సహాయం అందేలా చూస్తామని చంద్రబాబు హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఆయన స్పందిస్తూ... సహాయం అందేలా చొరవ చూపుతానని హామీ ఇచ్చారు. టిడిపి మాజీ మంత్రి, ఎపి స్టేట్ కన్జ్యూమర్ ప్రొడక్షన్ కౌన్సిల్ ఛైర్మన్ పీతల సుజాతను కలిసి దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను విన్నవించినట్లు తెలిపారు. టిడిపి నాయకులు ఎం.లక్ష్మీనారాయణ, మాజీ కౌన్సిలర్ బి.బాలాజీ, 28వ వార్డు ఇన్‌ఛార్జీ, అడ్వకేట్ జనార్ధన్, వన్నూరప్ప, రంగముని ఉన్నారు.

శ్రీనివాసరావుకు వినతిపత్రం ఇస్తున్న కల్లుపోతుల రంగన్న


మద్యం దుకాణాన్ని తొలగించాలి
- రోడ్డుపై కూర్చుని నిరసన

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని పురాతన శంభు లింగేశ్వర దేవాలయ పరిసరాల్లో మద్యం దుకాణాన్ని తొలగించాలని విరాట్ హిందూ సంఘం అధ్యక్షులు రామాంజనేయులు, హిందూ ధార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. శనివారం ప్రభాకర్ టాకీస్ రోడ్డులోని వారి కార్యాలయం నుంచి ఎక్సైజ్ పోలీసు స్టేషన్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడారు. రాష్ట్రంలో కొత్త మద్యం పాలసీతో ప్రయివేట్ వ్యక్తులకు లాటరీ ద్వారా మద్యం దుకాణాలు లభ్యమయ్యాయని తెలిపారు. శ్రీమహారాజ వైన్స్ పేరుతో పట్టణంలోని లంగర్ బావి వీధిలో 200 ఏళ్ల పురాతన శ్రీశంభు లింగేశ్వర దేవాలయం సమీపంలో మద్యం దుకాణం తెరిచి ఉంచారన్నారు. మద్యం ప్రియులు ఆలయ ప్రాంగణంలో మద్యం కోసం బారులు తీరి ఉంటున్నారని తెలిపారు. మద్యం దుకాణాన్ని వేరే చోటకు మార్చాలంటూ అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదన్నారు. దేవాలయం పక్కన సారా దుకాణం వద్దంటే, వద్దంటూ నినాదాలు చేస్తూ శ్రీశంభు లింగేశ్వర దేవాలయం నుంచి భీమాస్ కూడలి మీదుగా ఎక్సైజ్ శాఖ కార్యాలయానికి నిరసన ప్రదర్శన చేపట్టారు. మహిళలు సైతం ఎక్సైజ్ కార్యాలయం ముట్టడి చేసి గంటకు పైగా అధికారుల తీరుపై మండిపడ్డారు. ఎక్సైజ్ సిఐ సైదులు కలుగజేసుకొని మద్యం దుకాణాన్ని మూసివేసి వేరే చోటకు మార్చుకోవాలని మహారాజ మద్యం దుకాణం వ్యక్తులకు చరవాణి ద్వారా తెలిపారు.


నిరసన తెలుపుతున్న నాయకులు

అంటరానితనంపై పోరాటం
- దళిత సమైక్య వ్యవస్థాపకులు కట్ట స్వామి దాస్

ప్రజాశక్తి - కౌతాళం

గ్రామీణ ప్రాంతాల్లో దళితులపై అంటరానితనం, రెండు గ్లాసుల పద్ధతి కొనసాగుతూనే ఉందని, వాటిపై పోరాటాలకు సిద్ధం కావాలని దళిత సమైక్య వ్యవస్థాపకులు కట్ట స్వామి దాస్ కోరారు. శనివారం కౌతాళంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం దళిత సమాఖ్య మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా విజయ మోహన్, ఉపాధ్యక్షులుగా మారెప్ప, కార్యదర్శిగా అబ్రహాం, సహాయ కార్యదర్శిగా ఉలిగప్ప, సంయుక్త కార్యదర్శిగా ప్రకాష్, సలహాదారులుగా తిమోతి, ముఖేష్, నాగరాజు, దేవన్న ఉసేని, న్యాయ సలహాదారులుగా ప్రభాకర్, రాజేష్, కొంతమంది సభ్యులను ఎన్నుకున్నారు.


మాట్లాడుతున్న నాయకులు